టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న బృహత్తర అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీని వీడి ఎస్సీ, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన 15 కుటుంబాల వారు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మండలంలోని శిరిగిరిపాడుకు చెందిన పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వజ్రాల మల్లయ్య, బత్తుల వీరయ్యల ఆధ్వర్యంలో వీరు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పీఆర్కే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పట్ల ఎంతో అభిమానంతో ఉన్నారన్నారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జరుగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు. వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలిచి ఆయనను ముఖ్యమంత్రిని చేసేంత వరకు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ, ఆంజనేయులు, వెంకటనారాయణ, అంజి, మల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.




కనులపండువగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి

రెంటచింతల: స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ ద్వితీయ వార్షిక మహోత్సవ వేడుకలను బుధవారం కనులపండువగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి (రాంబాబు) నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. ఎంతో వైభవంగా నిర్వహించిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి శాంతి కళ్యాణ వేడుకలను భక్తులు చూసి తరించారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.











దామోదరం సంజీవయ్య ఆదర్శనీయుడు



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు

మాచవరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలందించిన దామోదరం సంజీవయ్య ఆదర్శనీయుడని జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ వెలిశెల అనిల్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. పేదల అభ్యున్నతికి ఆయన చేసిన సంస్కరణలు ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలియజేశారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంగళరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెంకట నరసింహా రెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లాభక్షు, వైఎస్సార్‌సీపీ నాయకులు దస్తగిరి, జానీ, స్వామి, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విభూతి బుధవారం



రెంటచింతల: ప్రపంచ మానవాళిని పాపముల నుంచి రక్షించుటకై యహోవా దేవుని కుమారుడైన ఏసుక్రీస్తు తన రక్తాన్ని చిందించిన పవిత్రమైన రోజులను జ్ఞాపకం చేసుకుంటూ క్రీస్తు ఆరాధికులు పవిత్రంగా ఉండాలని కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ. ఫాదర్ ఏరువ లూర్ధుమర్రెడ్డి అన్నారు. స్థానిక కానుకమాత చర్చిలో విభూతి బుధవారం సందర్భంగా 37 మంది ఉపవాస దీక్ష మాలలు ధరించిన వారికి జపమాలలు వేసి నుదుటిన శిలువాకారంలో విభూతిపెట్టి ప్రత్యేక ప్రార్థనలు చేసి మాట్లాడారు. పవిత్రమైన ఈ 40 రోజుల తపస్సు కాలంలో క్రైస్తవులందరూ భక్తితత్వంతో జీవించాలన్నారు. విశ్వశాంతికి ఏసుక్రీస్తు మారుపేరు అని ఆయన చూపిన మార్గంలో నడిచి ప్రభువును ప్రార్థించాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా వెంగళరావు

మాచవరం: మాచవరం ఇన్‌చార్జి ఎంపీడీవోగా వెంగళరావు నియమితులయ్యారు. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వరప్రసాద్ ప్రకాశం జిల్లాకు బదిలీ కాగా, నెల్లూరు జిల్లాకు చెందిన అధికారిని ఎంపీడీవోగా నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టకపోవడంతో మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న వెంగళరావును ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పాశం శ్రీనివాసరెడ్డి సేవలు ప్రశంసనీయం



రెంటచింతల: పంచాయతీరాజ్ ఇన్‌చార్జి డీఈగా విధులు నిర్వహిస్తున్న పాశం శ్రీనివాసరెడ్డి రెంటచింతల మండల అభివృద్ధికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని జెడ్పీ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఇంజనీర్‌గా గణతంత్ర దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించి మాట్లాడారు. శాఖాపరంగా చేసిన సేవలకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా 5వ సారి ఉత్తమ ఇంజనీర్‌గా గుర్తించి అవార్డుతో సత్కరించిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా రెంటచింతల మండలంలో 12 కి 12 సచివాలయాలు, 13 కి 13 రైతు భరోసా కేంద్రాలను సకాలంలో పూర్తిచేయడానికి ఏఈ శ్రీనివాసరెడ్డి ఎంతో కృషి చేసి జిల్లా ఉన్నతాధికారుల మన్ననలను పొందారన్నారు. ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో మండలంలోని 11 గ్రామాలలో రూ.22 కోట్ల విలువైన సీసీరోడ్లు, మెటల్‌రోడ్లు, మరో రూ.13 కోట్లతో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ క్లినిక్‌లు, అమూల్ పాలకేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు వంటి అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడం కీలక పాత్ర పోషించి ఉన్నతాధికారుల మన్ననలు పొందడం విశేషమన్నారు. శ్రీనివాసరెడ్డి 33 సంవత్సరాలుగా ఎక్కడ విధులు నిర్వహించినా మంచి అధికారిగా పేరు పొందారన్నారు.

గోశాలకు భూమి పరిశీలన

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ సమీపంలో గోశాలకి కేటాయించిన భూమిని తహసీల్దార్ పి.గీతావాణి బుధవారం పరిశీలించారు. గోశాల నిర్వాహకుడు పసుపులేటి పిచ్చయ్య గోశాలకు భూమి కేటాయించాలని గతంలో జిల్లా కలెక్టర్‌కి దరఖాస్తు చేసుకున్నాడు. పరిశీలించిన స్థానిక రెవెన్యూ అధికారులు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని గోశాలకు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇటీవల ఆన్‌లైన్‌లో గోశాల పేరుమీద భూమిని తొలగించారు. దీంతో పిచ్చయ్య జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ గీతావాణి గోశాలకు కేటాయించిన భూమిని, రికార్డులు పరిశీలించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కి పంపిస్తామని చెప్పారు. స్థానిక రెవెన్యూ అధికారులు, బత్తుల వెంకయ్య తదితరులున్నారు.

చోరీపై కేసు నమోదు

దాచేపల్లి : మండలంలోని శ్రీనగర్ గ్రామంలో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.సంధ్యారాణి బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భూక్యా బాలాజీ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం మధ్యాహ్నం వెళ్లి బీరువాను పగులగొట్టి అందులోని 15 సవర్ల బంగారం, 2జతల పట్టీలు చోరీ చేశారు. చోరీ జరిగిన సమయంలో ఇంట్లోని వారు పనులకు వెళ్లారు. పనుల నుంచి వచ్చి చూడగా బీరువా పగులగొట్టినట్లుగా బాధితుడు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం డాగ్ స్క్వాడ్ సిబ్బంది చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి పలు ఆధారాలు సేకరించారు.













'శ్రమ దినాలు' ప్రారంభం

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల నిర్వహణ



కేసానుపల్లి లూథరన్ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ ప్రసన్నకుమార్

దాచేపల్లి : శ్రమ(లెంటు) దినాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. గుడ్ ఫ్రైడేకు ముందు 40 రోజుల పాటు క్రైస్తవులు శ్రమ దినాలుగా పాటిస్తారు. శ్రమ దినాలు ప్రారంభమైన మొదటి రోజును భస్మ బుధవారంగా జరుపుకుని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేసానుపల్లి లూథరన్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాస్టర్ జీఎస్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ సర్వమానవాళిని పాపముల నుంచి విడిపించేందుకు ఏసుక్రీస్తు సిలువ మరణం పొందారని, సిలువలో క్రీస్తు చనిపోవటం ద్వారా ప్రజలు పాపాలను అంగీకరించి పరలోక రాజ్యంలో చేరతారన్నారు. క్రైస్తవులు ఉపవాసంతో ప్రార్థన చేసి దేవుని మహిమను పొందాలని అన్నారు. ఈ ప్రార్థనల్లో పాస్టర్లు కేఎస్ డేవిడ్‌రాజు, కుమార్, ఏఈఎల్‌సీ డెలిగేట్ వినుకొండ బాబు, చర్చి డెలిగేట్ శ్రీపతి కాశయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో ముస్లింలకు సముచిత స్థానం



పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షులు ఎండీ గఫార్, నాయకులు

పిడుగురాళ్ల: వైఎస్సార్‌సీపీలోనే ముస్లింలకు సముచిత స్థానం లభించిందని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షులు ఎండీ గఫార్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పట్టణంలో వైఎస్సార్‌సీపీ హయాంలో ముస్లింలకు ఏమీ జరగలేదని, తన హయాంలోనే ముస్లింలను మక్కాకు పంపించానని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ముస్లింలకు టీడీపీ హయాంలో ఒక్క ఎమ్మెల్యే స్థానం కూడా కల్పించలేదని, 2019 ఎన్నికల్లో ఐదుగురు ముస్లింలకు టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించుకొని కేబినెట్‌లో డిప్యూటీ సీఎం పదవి ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంగత నేత రాజశేఖర్‌రెడ్డిదన్నారు. పిడుగురాళ్ల మార్కెట్‌కు ముస్లిం అయిన తనకు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. మైనార్టీ సోదరుల హజ్ యాత్ర కోసం రూ.లక్ష ఇచ్చానని చెప్పుకుంటున్న యరపతినేని ముందు ఇస్లాం ధర్మం తెలుసుకో అని సూచించారు. ఇస్లాంలో అలా తీసుకొని వెళ్ల కూడదని చెప్పటంతో, ఎమ్మెల్యే కాసు ఇవ్వకుండా ఆగిపోయారన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో ముస్లింలు అడగ్గానే షాదీఖానా రూ.50 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. అలాగే తురకపాలెం, తుమ్మలచెరువు జానపాడు గ్రామాలతోపాటు నియోజకవర్గంలోని ప్రతి మండలానికి రెండు షాదీఖానాలు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. టీడీపీ నాయకులు అవాస్తవాలను మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీపై బురదచల్లటం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ పట్టణ కన్వీనర్ బచ్చేమేస్త్రీ, కౌన్సిలర్లు షేక్ అబ్దుల్లా, షేక్ సైదావలి, షేక్ కరిముల్లా, ఎస్‌కే సైదావలి, నాయకులు జానిబాబు, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రకు వెళ్లిన ముస్లింలు



ఉమ్రా యాత్రకు వెళ్లుతున్న ముస్లింలను సన్మానిస్తున్న దృశ్యం

దాచేపల్లి : పవిత్ర ఉమ్రా యాత్రకు బయలుదేరిన ముస్లింలను బుధవారం సన్మానించారు. నగర పంచాయతీతో పాటు పలు గ్రామాలకు చెందిన 15 మంది ముస్లింలు ఉమ్రా యాత్రకు బయలుదేరారు. వీరిని మండలంలోని గామాలపాడు గ్రామంలోని మహ్మదీయా మసీద్‌లో అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముస్తఫా ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రత్యేకంగా నమాజ్‌లు చేశారు. కార్యక్రమంలో మౌలానా ఫరూక్, యూనిస్, అబ్దుల్ ఖజీర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కి కానిస్టేబుల్ వెంకటరాము నాయక్

దాచేపల్లి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సపవత్ వెంకటరామునాయక్‌ని వీఆర్‌కి పంపిస్తూ జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గురజాల మండలం జంగమహేశ్వరపురంకి చెందిన ఓ మహిళ తనపై కానిస్టేబుల్ వెంకటరామునాయక్ లైంగికదాడి చేశాడని ఆరోపణలు చేస్తూ దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంకటరామును వీఆర్‌కి బదిలీ చేశారు.

జేఈఈ మెయిన్‌లో ఉత్తీర్ణత



దాచేపల్లి : స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థి మందా ఆకాష్ జెఈఈ మెయిన్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఇటీవల జేఈఈ మెయిన్‌కు హాజరైన ఆకాష్ 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ రవికుమార్ బుధవారం తెలిపారు. ఆకాష్‌ని పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ నాళం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవం



ఆలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

మాచర్ల రూరల్: గ్రామ ప్రజలంతా ఐక్యంగా మణిదీప బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించుకోవటం ఆనందకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో ప్రతిష్ట మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వామి వారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో, పాడి పంటలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇదే ఐక్యతతో పేదల సంక్షేమం కోసం, రైతన్నలకు అండగా ఉంటున్న, అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. ముందుగా పీవీఆర్‌కు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంటా నర్సిరెడ్డి, బోయ మల్లారెడ్డి, తాడిపత్రి శ్రీనివాసరెడ్డి, శివ, రామచంద్రారెడ్డి తదితరులు న్నారు.

ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్ లక్ష్యం



వైద్యశిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, ప్రజలు



జగనన్న సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి

పిడుగురాళ్ల: రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని తండా స్కూల్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి మాట్లాడుతూ వైద్య సిబ్బంది, వలంటీర్ల ద్వారా వారి పరిధిలోని ప్రతి ఇంటిని సర్వే చేయించి అనారోగ్యంతో ఉన్న వారి పేర్లు నమోదు చేయించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చేలా చేసి వైద్యులు చేత పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను ఇవ్వటం చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు పంపించి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు. ఇటువంటి వైద్య సేవలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దేనని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 300 మంది వైద్య సేవలు పొందినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీఎస్ గిరికుమార్, కౌన్సిలర్ కొక్కెర శ్రీను, వైద్యులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గడప వద్దకే వైద్యం

దాచేపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నడికుడిలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప వద్దకే వైద్యులను పంపించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని చైర్మన్ చెప్పారు. డాక్టర్లు సుచరిత, అమూల్య, వాసు ఈ కార్యక్రమంలో పాల్గొని 480 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు వేల్పుల ధర్మదేవ్, ఐనాల శ్రీరాములు, పల్లపు హనుమంతరావు, బొల్లంపల్లి ఏసుదానం, వేల్పుల జాను తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసరావుపేట బహిరంగ సభకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికేందుకు పిడుగురాళ్ల పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో నరసరావుపేటకు తరలివెళ్లారు. నరసరావుపేటలో జరిగే బహిరంగ సభకు హాజరయ్యేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివెళ్లారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాలతో ర్యాలీగా తరలివెళ్లారు. మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, ఎస్సీ సెల్ కన్వీనర్ కాలే మాణిక్యరావు, ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు బచ్చేమేస్త్రీ, అలాగే మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు.

భారీగా తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మాచర్ల: నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ రాకను పురస్కరించుకొని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పలు వాహనాలలో తరలివెళ్లారు. బుధవారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయం నుంచి 100 వాహనాలకు పైగా కాన్వాయ్‌తో బయలుదేరి వెళ్లారు. సీఎం జగన్, పీఆర్కేలకు జేజేలు పలుకుతూ పట్టణంలో ప్రదర్శనగా నరసరావుపేటకు తరలివెళ్లారు.

మిర్చి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సాంబశివరావుని సన్మానిస్తున్న దృశ్యం

దాచేపల్లి : రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్‌యార్డు చైర్మన్ కలకండ ఆంధ్రయ్య అన్నారు. నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయంలో పాలకవర్గ సమావేశం బుధవారం జరిగింది. యార్డు అభివృద్ధితో పాటు మిర్చి కొనుగోలు కేంద్రం విస్తరణపై చర్చించారు. ఈ సమావేశంలో చైర్మన్ ఆంధ్రయ్య మాట్లాడుతూ మిర్చి కొనుగోలు కేంద్రాన్ని రైతులకు అందుబాటులో ఉంచామని, గుంటూరు యార్డుకి వెళ్లి మిర్చి అమ్ముకునే అవసరం లేకుండా ఇక్కడ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులు మిర్చిని అమ్ముకోవాలన్నారు. గుంటూరు యార్డుతో సమానంగా ఇక్కడ మిర్చికి గిట్టుబాటు ధర లభిస్తుందని, పల్నాడు ప్రాంతంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు తీసుకున్న యార్డు సూపర్‌వైజర్ సాంబశివరావుని సన్మానించారు. అనంతరం యార్డులో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ చైర్మన్ తగుళ్ల పిచ్చయ్య, యార్డు కార్యదర్శి సూరె శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ వెంగయ్య, యార్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా రామిరెడ్డి



ఎం.వి.రామిరెడ్డి

మాచవరం: యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా మాచవరం మండలానికి చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు ఎం.వి.రామిరెడ్డి ఎన్నికైనట్లు మండల యూటీఎఫ్ నాయకులు తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగిన 77వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో జరిగిన ఎన్నికల్లో రామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండలంలోని వేమవరం మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. యూటీఎఫ్ నాయకులు జల్ది విజయప్రసాద్, కూరాకులు వెంకటేశ్వర్లు, కాంద్రకుంట రాంబాబు, కావాటి కోటేశ్వరరావు, డి.వి.కృష్ణ, మాటూరి మరియదాసు తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అంకిత భావంతో కృషి చేసిన వారికి ప్రాధాన్యత

పార్టీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు పీవీఆర్



ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సంపూర్ణమ్మ

రెంటచింతల: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేసిన వారికే మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పార్టీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీగా పి.సంపూర్ణమ్మ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అప్పటి అధికార పార్టీలో ఉన్న సంపూర్ణమ్మ సీఎం జగన్ కుటుంబంపై అభిమానంతో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావంతో పార్టీలో ఒక సామాన్యకార్యకర్తగా చేరి పార్టీ అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తూ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టడం ఎంతో గర్వకారణమన్నారు. పార్టీలో నాయకుల మధ్య చిన్న చిన్న అపార్థాలు ఉన్నా వాటిని పరిష్కరించుకుని 2024లో మరోసారి జగనన్నను సీఎంగా, మాచర్ల నుంచి 5వ సారి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంపూర్ణమ్మ మాట్లాడుతూ ఇచ్చిన మాట తప్పకుండా తనను ఎంపీపీగా చేసిన పిన్నెల్లి సోదరుల రుణం తీర్చుకుంటానని పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో కలిసి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఎంపీడీవో పి.శంకర్‌రావు సంపూర్ణమ్మతో ప్రమాణ స్వీకారం చేయించారు. జెడ్పీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బ్రహ్మారెడ్డి, మాజీ ఎంపీపీ చౌడేశ్వరి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు పూజల రామయ్య, సత్రశాల దేవస్థానం చైర్మన్ బ్రహ్మారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల పట్టణ ఎస్‌ఐగా అమీర్



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ ఎస్‌ఐగా అమీర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా బెల్లంకొండ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న అమీర్ పిడుగురాళ్ల పట్టణ ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు. బాధ్యతలను స్వీకరించి సీఐ పీవీ ఆంజనేయులను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావు వినుకొండకు బదిలీ అయ్యారు.

25న విశ్వకర్మ ఆర్టిజన్ ఆత్మీయ సమావేశం

పిడుగురాళ్ల: ఈ నెల 25వ తేదీన విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో కందుకూరి ఫంక్షన్ హాల్‌లో జరగబోయే విశ్వకర్మ ఆర్టిజన్ ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర బీజేపీ ఆర్టిజన్ విభాగం అధ్యక్షులు బంగారు బాబు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో విశ్వబ్రాహ్మణ సమావేశం నిర్వహించారు. బీసీలకు, ముఖ్యంగా విశ్వబ్రాహ్మణులకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలని ఆల్ ఇండియా ఓబీసీ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు కొల్లూజు ప్రసాద్ పేర్కొన్నారు. పిడుగురాళ్ల పట్టణ, మండల అధ్యక్షులు ఎస్.మల్లేశ్వరరావు, ఎం.నరసింహాచారి, సంఘ నాయకులు శ్రీనివాస్, ఆచార్యులు, వేణుగోపాలకృష్ణ, లక్ష్మణాచారి, ఆంజనేయులు, రాము, శ్రీనివాసాచారి, పాండురంగాచారి, విష్ణుమూర్తి, కాశీప్రసాద్, రమేష్, సిద్ధాంతి విశ్వరూపాచార్యులు పాల్గొన్నారు.